# "నేను పుస్తకాన్ని చూడను; మస్తకాన్ని చూస్తాను"

(2007 ఆగస్టు 24వ తేదీ శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్టు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు. అది బుక్ ట్రస్టు సిబ్బందికి చిరస్మరణీయమైన పర్వదినం. ఆరేళ్ళ విరామం తరువాత భగవాన్ మళ్ళీ ఆరోజున బుక్ ట్రస్టు భవనాన్ని తమ దివ్య పాదస్పర్శతో పునీతం చేశారు. 2001 ఆగస్టు 23వ తేదీన తమ దివ్యహస్తాలతో బుక్ ట్రస్టు భవనానికి ప్రారంభోత్సవం జరిపిన తరువాత భగవాన్ బుక్‌స్టాల్‌ను, ఆడియో విజువల్స్ విభాగాన్ని మాత్రమే సందర్శించడం జరిగింది. పై అంతస్తులో ఉన్న బుక్ ట్రస్టు కార్యాలయం, మల్టీ మీడియా హాలు మరియు సనాతన సారథి కార్యాలయం ఆనాడు స్వామి దివ్య పాదస్పర్శకు నోచుకొనలేదు. 2007 ఆగస్టు 23న బుక్ ట్రస్టు భవనంయొక్క ఆరవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సిబ్బంది చేసిన హృదయపూర్వకమైన ప్రార్థనను మన్నించి, కరుణాంతరంగులైన స్వామి మరునాడు ఉదయం తొమ్మిది గంటలకు బుక్ ట్రస్టు కార్యాలయానికి విచ్చేసి, తమ దర్శన స్పర్శన సంభాషణలతో వారి హృదయాలను ఆనందడోలికలలో ఓలలాడించారు. భగవాన్ బాబావారి దివ్యాగమనంతో బుక్ ట్రస్టులోని అణువణువు చైతన్యవంతమైంది. ఈసందర్భంగా భగవాన్ అనుగ్రహించిన దివ్య సందేశం బుక్‌ట్రస్టు సిబ్బందిలో ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపింది. ఆనాటి భగవాన్ దివ్య సందేశంయొక్క పూర్తి పాఠం ఈ క్రింద ప్రచురించడమైనది.)

ఇక్కడ పనిచేసే పిల్లలందరూ చాలా భక్తి, శ్రద్ధలతో చేస్తున్నారు. పిల్లలయొక్క ప్రోద్బలముచేతనే ఈ బుక్ ట్రస్టు పెరుగుతూ వచ్చింది. అయితే, పుస్తకములు ప్రధానం కాదు, మస్తకము ప్రధానం. పుస్తకములోనిది మస్తకములో చేర్చి హస్తముద్వారా ఆచరణలో

srisathyasaivachanamrutam

పెట్టాలి. పుస్తకము, మస్తకము, హస్తము - ఈ మూడింటి ఏకత్వానికి కృషిచేయాలి. ఈనాడు ప్రపంచానికి అవసరమైనటు వంటిది సేవ. అందరినీ ప్రేమించాలి, అందరినీ సేవించాలి. ఇదే మనము చేయవలసింది. మనము ఏ పని చేసినా అది దైవసేవగా భావించాలి. పరమాత్ముడు లేని ప్రదేశము ఎక్కడా కనిపించదు. 'ఇందుగలడందు లేడని సందేహము వలదు...' God is in you, with you, around you, above you, below you. ఏ ఒక్క పనిచేసినా అంతా దైవసంకల్పానుసారమే జరుగుతుంది గాని, మరొక విధంగా జరగటానికి వీల్లేదు.

**విశాలమైన భావాలను పెంపొందించే పుస్తకాలు ప్రింటు చేయాలి**

చూడండి - ఇది ఒక వస్త్రము. కాని, ఇది వస్త్రము కాదు, దారములయొక్క చేరిక. ఈ దారములు ప్రత్తిచేత తయారవుతున్నాయి. మొట్టమొదటిది ప్రత్తి, రెండవది దారము, మూడవది వస్త్రము. ఈ మూడూ చేరి ఒక్కటే. అదేవిధముగా, నీవు ఒక్క వ్యక్తివి కావు, నీలో ముగ్గురున్నారు - 1. నీవనుకునే నీవు 2. ఇతరులనుకునే నీవు 3. అసలైన నీవు. ఒక పుస్తకాన్ని తయారు చేయడంలోకూడా ముగ్గురు వ్యక్తుల ప్రమేయం ఉంటుంది - రాసేది ఒకరు, ప్రింటు చేసేది ఒకరు, చదివేది ఒకరు. మీరు ఎన్ని గ్రంథములు ప్రింటు చేస్తున్నారన్నది ప్రధానం కాదు. అవి మంచి పుస్తకాలుగా ఉండాలి. విశాలమైన ప్రపంచానికి విశాలమైన భావములు అందించే పుస్తకాలను ప్రింటు చేయాలి. సంకుచిత భావములకు చోటివ్వకుండా విశాలమైన భావములను పెంపొందించాలి. అందరికీ అవసరమైన, ఉపయోగకరమైన పుస్తకాలను ప్రింటు చేయాలి. డబ్బు ప్రధానం కాదు; నైతిక విలువలు ప్రధానమైనవి. Money comes and goes, morality comes and grows. కాబట్టి, నైతిక విలువలను మనము పెంచుకోవాలి. ఎన్ని పుస్తకాలు వ్రాసినప్పటికీ, మీరు ఎన్ని పుస్తకాలు చదివినప్పటికీ అందులో ఉన్న మంచి విషయాలలో ఒక్కటైనా ఆచరణలో పెట్టకపోతే అవన్నీ వ్యర్థమే. తట్టలో ఉన్న పదార్థముల పేర్లు చెప్పినంత మాత్రమున మన పొట్ట నిండదు. ఒక్కటైనా భుజించాలి. అదేరీతిగనే పుస్తకాలు ఎన్నో ఉన్నాయి. స్వామియొక్క విషయాలు అనేకంగా వ్రాస్తున్నారు. కాని, అందులో ఒక్కటైనా మీరు ఆచరణలో

srisathyasaivachanamrutam

పెడుతున్నారా? లేదు. ఆచరణ లేకుండా పుస్తకాలు చదివి ప్రయోజన మేమిటి?! పది విషయాలు వింటే మీరు ఒక్కటైనా ఆచరణలో పెట్టాలి. అప్పుడే మీకు తగిన బలము, శక్తిసామర్థ్యములు చేకూరుతాయి.

బుక్ ట్రస్టు అభివృద్ధికోసం రాజన్ చాలా అవస్థ పడుతున్నాడు. అనేక రకములైనటువంటి ప్రయత్నాలు చేస్తున్నాడు. తన వయస్సుకు మించినటువంటి పని చేస్తున్నాడు. ఇక్కడ పనిచేస్తున్న పిల్లలనుకూడా తగినటువంటి మంచి అనుకూలమైన వాతావరణంలో పెడుతున్నాడు. ఎక్కడైనా సరే, 'కోఆపరేషన్' (పరస్పర సహకారము) ఉన్నప్పుడే తగినటువంటి ఫలితము వస్తుంది. ఈ 'కోఆపరేషన్' అనేది ఎట్లా ఉండాలి? హృదయానికి, హృదయానికి మధ్య సంబంధము కలిగించేటట్లుగా ఉండాలి. అంతేకాకుండా, దానిని మానసికంగా చక్కగా అర్థం చేసుకోవాలి.

**ఏకత్వాన్ని, పవిత్రతను పెంచుకున్నప్పుడే మీరు దివ్యత్వాన్ని అందుకోగలరు**

All are one, be alike to everyone. అందరూ ఒక్కటిగా ఉండాలి. పుస్తకాన్ని ఒకరు ప్రింట్ చేయవచ్చు, ఒకరు బైండ్ చేయవచ్చు, ఒకరు పోస్ట్ చేయవచ్చు. ఎవరేది చేసినప్పటికీ అందరూ చేరి ఒక్కటే. అందరూ ఏకమైనప్పుడే మనస్సుకు తగిన శాంతి కలుగుతుంది. 'యూనిటీ' ఉన్నప్పుడే 'ప్యూరిటీ' వస్తుంది. 'ప్యూరిటీ' వచ్చినప్పుడే 'డివినిటీ' వస్తుంది. కనుక, మొట్టమొదట 'యూనిటీ', 'ప్యూరిటీ'లను పెంచుకోండి. అప్పుడే 'డివినిటీ'ని అందుకోగలరు. మీరందరూ ఏకమైపోవాలి. అందరూ ఏకభక్తితో ఉండాలి. నేను చూసేది పుస్తకము కాదు; మస్తకాన్ని చూస్తాను. రాజన్ ఎన్నో పుస్తకాలు ప్రింటు చేసి నాదగ్గరకి తీసికొని వస్తుంటాడు. కాని, పుస్తకములను చూస్తే నాకంత తృప్తి లేదు. రాసినవారి మస్తకము ఎట్టిది? అనేది నేను చూస్తాను. పాత్ర పరిశుద్ధంగా ఉన్నప్పుడే అందులో వండిన పదార్థము రుచిగా ఉంటుంది. కనుక, మొట్టమొదట మీ 'హార్ట్' పరిశుద్ధం కావాలి. ఏమి జరిగినప్పటికీ, ఎన్ని మారినప్పటికీ 'హార్ట్' మాత్రము మారకూడదు. 'హార్ట్' అంటే 'ఫిజికల్ హార్ట్' (గుండె) కాదు. నేను చెప్పేది 'స్పిరిచువల్ హార్ట్' (హృదయం) గురించి. అదే దైవముయొక్క నివాసము. ఆ దైవమునే 'ఆత్మ' అని పిలుస్తారు. దైవమునకు ఒక ప్రత్యేకమైన రూపము లేదు; కాని ఎక్కడ చూసినా ఉంటున్నాడు. నీ లోపల, నీ వెలుపల,

sri sathyasaivachanamrutam

నీపైన, నీ క్రింద ఎక్కడ చూసినా ఉన్నది ఆత్మనే. కాని, కోరికలనే 'క్లౌడ్స్' (మేఘాలు) వచ్చి చేరటంచేత నీకు ఆత్మ కనిపించటం లేదు.

**దైవాన్ని మరచి చేసేదంతా వ్యర్థమే!**

ఆకాశంలో మేఘాలు అడ్డు వచ్చినప్పుడు చంద్రుడు కనిపించడు. అంతమాత్రమున చంద్రుడు లేడని చెప్పకూడదు. చంద్రుడు ఉన్నాడు. నీవు చూడాలంటే కొంచెం ఓపిక పట్టు. మేఘములు కదలిపోతూనే చంద్రుడు కనిపిస్తాడు. 'చంద్రమా మనసో జాతః చక్షో సూర్యో అజాయత'. మన హృదయమనే ఆకాశములో ఆత్మ అనే చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. మన 'థాట్స్', 'డిజైర్స్' (ఆలోచనలు, కోరికలు) వచ్చి 'క్లౌడ్స్' మాదిరి దీనిని కప్పి వేస్తుంటాయి. కొన్నికొన్ని సీజన్లలో 'క్లౌడ్స్' చాలా దట్టంగా వస్తుంటాయి. అప్పుడు చంద్రుడు అసలు కనిపించనే కనిపించడు. అదేవిధముగనే, ప్రతి ఒక్కరి హృదయమునందు దైవమున్నాడు. నీ ఆలోచనలు, కోరికలు అనే మేఘాలు చాలా దట్టంగా ఉండటం చేత నీకు దైవము కనిపించడం లేదు. కనుక, కోరికలను నీవు కంట్రోలు చేసుకోవాలి. కోరికలే ఆత్మను కప్పివేస్తున్నాయి. కోరికలను ఎంత తగ్గించుకుంటే అంత మంచిది. దీనినే వేదాంతపరిభాషలో 'వైరాగ్యము' అని అన్నారు. దినదినానికీ మన దేహము పెరుగుతూ ఉన్నది. కాని, ఆయుస్సు మాత్రం తరుగుతూ ఉన్నది. కనుక, Less luggage, more comfort makes travel a pleasure. కోరికలనే 'లగేజి'ని తగ్గించుకుంటే జీవిత ప్రయాణం ఎంతైనా హాయిగా ఉంటుంది. ఏ గ్రంథాలు చదివినా, ఏ పవిత్రమైన చరిత్రలు విన్నా మీరు కోరికలను తగ్గించుకొనకపోతే ప్రయోజనం లేదు. అయితే, ప్రతి ఒక్కరికీ కోరికలు ఉంటాయి. కాని, కొన్ని ఉపయోగం ఉన్నవి ఉంటాయి, కొన్ని ఉపయోగం లేనివి ఉంటాయి. అసలు తెల్లవారి లేవడమే మీరు కోరికలతో లేస్తున్నారు.

**నిద్దురనుండి లేచి మరి నిద్దురపోయెడు దాక పొట్టకై**
**హద్దును పద్దు లేక వ్యయమందగజేయుచు జీవితంబు నీ**
**విద్దెల ధారవోసి అరవింద దళాక్షుని విస్మరించి ఏ**
**పెద్ద సుఖంబు పొందితివొ ప్రీతిగ యోచన చేయు మానవా!**

దైవాన్ని మరచి మనము ఏమి చేసినా అది వ్యర్థమే. మొట్టమొదట దైవాన్ని లక్ష్యములో



sri sathyasaivachanamrutam

పెట్టుకోవాలి. ఎన్ని కష్టనష్టములు వచ్చినప్పటికీ, ఎవరెన్ని చెప్పినప్పటికీ మనం దైవాన్ని వదలకూడదు. ఆవిధమైన నిశ్చలమైన, నిర్మలమైన భక్తి మనలో నిలిచినప్పుడే మనము భక్తుల మవుతాము. అట్లుగాకుండా మనస్సు చంచలంగా ఉంటే నీవు భక్తుడవే కావు. 'డివోషన్' (భక్తి) అనేది 'ఓషన్' (సముద్రము)వలె ఎల్లప్పుడు తగ్గిపోకుండా ఉండాలి. ఒకవైపున నీరు ఆవిరైపోతుంటుంది. మరొక వైపున నదులు వచ్చి చేరిపోతుంటాయి. కనుక, సముద్రము ఎప్పుడుకూడను హెచ్చుతగ్గులు లేకుండా ఒకేవిధంగా ఉంటుంది. మన హృదయమును ఒక సముద్రముగా పెట్టుకోవాలి. కోరికలనే అలలచేత దానియందు అలజడి సృష్టించకూడదు. అలలు ఎన్ని వచ్చినప్పటికీ సముద్రము సముద్రముగానే ఉంటుంది. అదేవిధంగా, మీ హృదయాన్ని ఎల్లప్పుడు పవిత్రమైన రీతిగా, నిర్మలమైనరీతిగా, నిస్వార్థమైనరీతిగా ఉంచుకొని జీవించాలి.

మా రాజన్ చాలా కష్టపడి పనిచేస్తున్నాడు. పుస్తకాల విషయంలో ఎన్నెన్నో మార్పులు చేయాలని ప్రయత్నిస్తున్నాడు. 80వ బర్త్‌డేకి చాలా మంచి పుస్తకాలు తయారు చేశారు. అయితే, ఏవిధమైన ఆశలూ పెట్టుకోవద్దు. ఏ ఒక్కటి చేసినా దైవార్పిత భావంతో చేయాలి. 'సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం' అనే భావంతో పని చేయాలి. అదే నిజమైన భక్తి. 'ఇది నా పని, ఇది స్వామి పని, ఇది మందిరం పని, ఇది పబ్లిక్ పని' అనే భేదం పెట్టుకోవద్దు. అందరి పనీ ఒక్క దైవానిదే. పుస్తకం రాసినవాడు, ప్రింటు చేసినవాడు, చదివేవాడు అందరూ ఒక్కటే. కనుక మీరు వ్యత్యాసాలు పాటించకండి. అప్పుడే నిజమైన, స్థిరమైన భక్తి కుదురుతుంది. భక్తి 'స్టెడీ' (నిశ్చలం)గా ఉండాలేగాని ఊరకే చంచలంగా ఉంటే ప్రయోజనం లేదు. చంచలమైన మనస్సువల్ల ఏమి జరుగుతుంది? ఫలితంలో కూడా మార్పు కలుగుతుంది. కనుక, మనస్సులో చంచలత్వానికి చోటివ్వకూడదు. కోరికలు, ఆలోచనలు వస్తాయి. అక్కడ మనము విచక్షణ ఉపయోగించాలి. 'ఇది మంచిదా? చెడ్డదా? ఇది తప్పా? ఒప్పా?' అని విచారణ చేయాలి. 'అది ఒప్పు' అని నీ అంతరాత్మ అన్నప్పుడు నీవు దానిని తప్పక ఆచరించు. అంతరాత్మ ఇచ్చిన 'సిగ్నల్'కు విరుద్ధంగా మనము ఎప్పుడూ నడుచుకోకూడదు. నీ అంతరాత్మకు 'ఇది రైటు' అని తోచినప్పుడు, ఎవరు ఏమనుకున్నా సరే, దానిని నీవు తప్పక అనుసరించు. చెప్పేవాళ్ళు చెపుతుంటారు. కాని, మన మనస్సు

srisathyasaivacharamrutam

ఎప్పుడూ స్థిరంగా ఉండాలి.

**సత్యధర్మాలను లక్ష్యములో పెట్టుకొన్నప్పుడే మనము జీవిత గమ్యాన్ని చేరగలము**

గ్రంథపరిచయం గొప్పతనం కాదు. గ్రంథములలో ఉన్న గంధాన్ని (Essence) ముఖ్యంగా తీసుకోవాలి. 'మేటర్' (Matter) లేకపోతే అది పుస్తకమే కాదు. విషయమే లేకపోతే అది 'మేటరే' కాదు. ఆ విషయం (సబ్జెక్టు) ఎలాంటిదిగా ఉండాలి? అది హృదయానికి సంబంధించిన సబ్జెక్టుగా ఉండాలి. కనుక, వ్రాసేటటువంటివారు మంచి గ్రంథాలు వ్రాయాలి. పిచ్చిపిచ్చివన్నీ మనము ప్రింటు చేయకూడదు. లౌకికమైన కోరికలకు సంబంధించిన పుస్తకాలు బయట ఎన్నో ప్రింటు చేస్తున్నారు. కాని, అవి ఏమైపోతున్నాయి? ఎవ్వరూ వాటికి విలువ ఇవ్వటం లేదు. హృదయానికి హత్తుకొనేటటువంటి విషయములే సత్యమైనవి. సత్యాన్ని, ధర్మాన్ని వదలకుండా మన కర్మలను మనము ఆచరించాలి. సత్య, ధర్మములు రెండూ వేరువేరు కాదు. "సత్యాన్నాస్తి పరో ధర్మః" సత్యము, ధర్మము రెండూ బింబ ప్రతిబింబాలే! ధర్మమే లేకపోతే సత్యమే లేదు. సత్యమే లేకపోతే ధర్మమే లేదు. ఈ రెండూ ఉంటే మనము ఎంతైనా సాధిస్తాము. ఈ రెండింటినీ లక్ష్యములో పెట్టుకొన్నప్పుడు మనము జీవితగమ్యాన్ని చేరతాము. ఈనాడు నేను అధికంగా చెప్పడానికి వీల్లేదు. నేను చెప్పదల్చుకున్నది కేవలం గ్రంథములకు సంబంధించిన విషయమేగాని మరొకటి కాదు. మీరందరూ విన్నారు, ఎన్నో పుస్తకాలు చదివారు. ఇప్పటినుంచైనా విన్నటువంటి విషయాన్ని మీ హృదయంలో పెట్టుకొని దాని ప్రకారం నడుచుకోవడానికి ప్రయత్నించండి.

**(తేదీ 24.08.2007, శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్టు కార్యాలయం)**

sri sathyasaivachanamrutam